

ప్రసవాల సంఖ్య పెంచాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి – పోడూరు

పిహెచ్‌సిలో నెలకు ప్రసవాల సంఖ్య పదికి తగ్గకుండా చూడాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు సూచించారు. పోడూరు పిహెచ్‌సిని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జాతి ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పరిశుభ్రత, పరిసరాలు, ద్రవ్యాలను పరిశీలించారు. మండలంలో మూడు ఎంఎల్‌హెచ్‌పి పోస్టులను భర్తీ చేయాలని వైద్యాధికారి శ్రీనివాస్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మూడు మండలాలకు కలిపి వైద్య పరీక్షల నిమిత్తం నిర్మిస్తున్న సిఎస్‌సి బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణాన్ని పరిశీలించారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు నుంచి ప్రజలను అప్రమత్తం చేసేలా తరచూ శిబిరాలు పరిసరాలను పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. లోపాలను సరిచేసుకుని నిత్యం వైద్యులు సిబ్బంది, ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరించారు.

ఆక్వాకు విద్యుత్ రాయితీ ఎప్పుడో..!



- ఏలూరు, పశ్చిమ జిల్లాల్లో 3 లక్షల ఎకరాల్లో సాగు
- ఆక్వాకు యూనిట్‌కు రూ.1.50కు విద్యుత్ ఇస్తామని కూటమి హామీ
- రెండు జిల్లాల్లో లక్ష ఎకరాల్లో రైతులకు లబ్ధి చేకూరే అవకాశం
- తొలి కేబినెట్ సమావేశంలో నిర్ణయం జరిగేనా
- హామీ అమలుపై ఆక్వా రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

ఆక్వా సాగుకు విద్యుత్ రాయితీ అమలుపై రైతులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఎప్పటి నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తారని చర్చ రైతుల్లో సాగుతోంది. తొలి కేబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం ఉంటుందా అనే ఉత్కంఠ రైతుల్లో నెలకొంది. ఇప్పటికిప్పుడు ప్రభుత్వంపై ఆర్థిక భారం పడే అవకాశం లేకపోవడంతో ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. ఏలూరు జిల్లాలో లక్ష 85 వేల ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా 30 వేల ఎకరాలు మొత్తం 3.15 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వాసాగు చేస్తున్నారు. రొయ్యల సాగులో మూడొంతులు రొయ్యల సాగే ఉంది. రొయ్యలు, చేపల సాగు చేసే రైతులు కరోనా దగ్గర నుంచి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. సరైన ధర లేకపోవడం, మేత ధరలు పెరిగిపోవడం వంటి అంశాలు ఆక్వా రైతులను నిలువునా దెబ్బతీస్తున్నాయి. 2019 ఎన్నికల్లో ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ ఇస్తామని వైసిపి ప్రకటించింది. తర్వాత ప్రభుత్వం నిబంధనలను తెరపైకి తెచ్చింది. ఆక్వా జోన్‌లో ఉండి, పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే విద్యుత్ రాయితీ వర్తిస్తుందని నిబంధన తీసుకొచ్చింది. దీనిపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రొయ్యల సాగులో నిరంతరం ఏరియేటర్స్ తిప్పాల్సి ఉంటుంది. దీనికి పెద్దఎత్తున విద్యుత్ ఖర్చవుతోంది. విద్యుత్ రాయితీ ఇవ్వకపోవడంతో చాలామంది రైతులు పెద్దఎత్తున విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఆక్వా సాగు సంక్షోభంలో కూరుకుపోయిందని, నిబంధనలతో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయాలని కోరినా వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. అటువంటి పరిస్థితుల్లో తాము అధికారంలోకి వస్తే గత టిడిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసినట్లుగానే ఆక్వా రైతులందరికీ యూనిట్ రూ.1.50కు విద్యుత్ అందిస్తామని టిడిపి ప్రకటించింది. జిల్లాలో పర్యటించిన ప్రతిసారీ టిడిపి అధినేత చంద్రబాబు, యువగళం యాత్రలో లోకేష్ సైతం రైతులకు హామీ ఇచ్చారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఇదే అంశాన్ని పొందుపరిచారు. ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దీంతో ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ ఎప్పటి నుంచి వర్తింపచేస్తారనే చర్చ మొదలైంది. దీనికి ప్రత్యేక కారణం ఉంది. ఆక్వా సాగులో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. జిల్లా నుంచి ప్రతియేటా వేల టన్నుల ఆక్వా ఉత్పత్తులు జిల్లా నుంచి ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో అతిపెద్ద సాగుగా ఆక్వా ఉంది. రాష్ట్రానికి విదేశీ మారక ద్రవ్యం సైతం ఆక్వా నుంచి వస్తోంది.

3 వేలకు పైగా విద్యుత్ సర్వీసుల పరిధిలో రైతులకు లబ్ధి

వైసిపి ప్రభుత్వం పదెకరాలలోపు ఆక్వా రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయడంతో చాలామంది రైతులకు సబ్సిడీ అందని దక్కని పరిస్థితి నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా 30 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా మొత్తం 16 వేల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 13 వేల విద్యుత్ కనెక్షన్లకు యూనిట్ రూ.1.50 విద్యుత్ రాయితీ వర్తిస్తోంది. ఇంకా మూడువేల కనెక్షన్లకు విద్యుత్ రాయితీ వర్తించని పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో 13 వేల వరకూ ఆక్వా విద్యుత్ సర్వీసులు ఉండగా దాదాపు 85 శాతం సర్వీసులకు విద్యుత్ రాయితీ వర్తిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా 300 విద్యుత్ సర్వీసులకు విద్యుత్ రాయితీ వర్తించడంలేదని తెలుస్తోంది. రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 3,300 ఆక్వా విద్యుత్ సర్వీసులకు రాయితీ వర్తించని పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. ఈ సర్వీసుల పరిధిలో దాదాపు లక్షలాది ఎకరాల్లో ఆక్వా సాగు ఉండొచ్చని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిబంధనలతో సంబంధం లేకుండా జిల్లాలోని అన్ని ఆక్వా విద్యుత్ సర్వీసులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ రాయితీ ఇవ్వాల్సి ఉంది. ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. ఇది ఎప్పటి నుంచి అమలు చేస్తారో వేచిచూడాలి.

ఏలూరు, పశ్చిమ కలెక్టర్ల బదిలీ

ఏలూరు కలెక్టర్‌గా వెట్రిసెల్వి

పశ్చిమ కలెక్టర్‌గా నాగరాణి



ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి



భీమవరం కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను బదిలీ చేస్తూ సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న కె.వెట్రిసెల్విని ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను చిత్తూరు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న సి.నాగరాణి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. రెండు జిల్లాలకు మహిళలు కలెక్టర్లుగా నియమితులు కావడం విశేషం.

ధాన్యం సొమ్ము వెంటనే ఇవ్వాలని రైతుల ఆందోళన



అగ్రికల్చరల్ అసిస్టెంట్‌కు వినతి అందిస్తున్న రైతులు

ప్రజాశక్తి – పెంటపాడు

రైతులకు చెల్లించాల్సిన ధాన్యం సొమ్ము వెంటనే ఇవ్వాలని కోరుతూ మండలంలోని కె.పెంటపాడు రైతుభరోసా కేంద్రం వద్ద రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యాన శనివారం ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అగ్రికల్చరల్ అసిస్టెంట్ సుస్మితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కరక వెంకట్రావు, చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ దాళ్వా ధాన్యం ఐకెపి ద్వారా అమ్మి సుమారు మూడు మాసాలు కావొస్తున్నా ధాన్యం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేయలేదన్నారు. జూన్ ఒకటో తేదీన నీరు విడుదల చేశామని, నారుమడులు వేయాలని పదేపదే ప్రకటిస్తున్నారని అన్నారు. విత్తనాలు, ఎరువులు కొనాలన్నా కూలీలకు సొమ్ము చెల్లించాలన్నా రైతుకు రావాల్సిన ధాన్యం సొమ్ము ప్రభుత్వం దగ్గర ఉందని, పెట్టుబడులకు అప్పు తెచ్చి సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా రైతులు బ్యాంక్ ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేయాలన్నారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గా, వీరబత్తుల దానయ్య, మామిడిశెట్టి శ్రీను, అంబటి ఆదియ్య, వీరబత్తుల ప్రసాద్, అంబటి రాఘవులు, షేక్ భాషా, వాడపల్లి కృష్ణ, వీరబత్తుల పుల్లారావు, వి.రాంబాబు, గోక సత్యనారాయణ, వీరబత్తుల వెంకటేశ్వరరావు, నల్లమిల్లి పల్లారెడ్డి, వీరబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇరగవరం: రైతులకు చెల్లించాల్సిన ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలని కౌలురైతు, రైతుసంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రైతుసంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ మూడు నెలలైనా ధాన్యం సొమ్ము రైతులకు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. మళ్లీ వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడం వల్ల రైతుల వద్ద పెట్టుబడులకు సొమ్ము లేక దళారుల వద్ద అధిక వడ్డీలకు అప్పు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం వెంటనే రైతులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులు పెద్దఎత్తున ఉద్యమిస్తారని స్పష్టం చేశారు. కౌలురైతులకు వెంటనే గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి సుబ్బారావు, పాలా శ్రీను, బొక్కా వెంకటేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు, గుబ్బల ముత్యాలరావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, పాలా సత్యనారాయణ పాల్గొన్నారు.

అతిసార, డెంగ్యూ అరికట్టాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి – భీమవరం టౌన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో అతిసార, డెంగ్యూ వంటి కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు అధికారులు పూర్తి సన్నద్ధతతో పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆయన గూగుల్‌మీట్ ద్వారా ఆర్‌డబ్ల్యుఎస్, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, పంచాయతీరాజ్ తదితర అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయించి పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణపత్రాన్ని అందజేయాల్సి ఉందన్నారు. తాగునీటి శాంపిల్స్ సంబంధిత ల్యాబ్‌లో టెస్టింగ్ జరుగుతుందో, లేదో పర్యవేక్షించాలన్నారు. ఒహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్ స్టెయిర్ కేస్ ప్యానల్స్ ఖాళీలు లేకుండా మరమ్మతులు చేయించాలని, లేకపోతే పక్షులు వంటి చిన్న చిన్న జంతువులు చనిపోయి ట్యాంక్‌లో పడిపోయే అవకాశం ఉందన్నారు. ట్యాంకుల క్లీనింగ్‌కు టాబ్లెట్స్ దొరుకుతున్నాయని పంచాయతీలో తీర్మానం చేసి రూ.20 వేలు మండలంలోని ట్యాంక్‌లు శుభ్రం చేయించేందుకు ఎంపిడిఒలకు నిధులను అందజేయాలన్నారు. బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేస్తే ఇతరత్రా ఇబ్బందులు వస్తున్నాయని సూచించారు. ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి, ప్రతిరోజూ పారిశుధ్యాని పర్యవేక్షించాలన్నారు. ఏ గ్రామంలో చూసినా రోడ్లు వెంబడి చెత్త డంపింగ్ యార్డులను తలపిస్తుందని, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ కొరవడిందని అన్నారు. పైపులైన్ లీకేజీలు అరికట్టకపోతే తాగునీరు కలుషితమై తద్వారా డయేరియా ప్రబలుతుందని, వెంటనే లీకేజీలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మొగల్తూరు ప్రాంతంలో మోటార్ల ద్వారా నీటిని తోడటం వల్ల శివారు ప్రాంతాల ప్రజలు సాగునీటి ఎద్దడికి గురవుతున్నారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను ఆదేశించారు. పైపులైన్ల లీకేజీలు ఉంటే నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, వెంటనే లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. ఒహెచ్‌ఆర్‌ఎస్, ఎస్ఎస్, పిడబ్ల్యుడి ట్యాంకుల నీటి నిల్వలను తరచూ పరీక్షించాలని, గృహాల్లో వినియోగించే ట్యాంకులను కూడా టెస్టింగ్ చేయడంతోపాటు శుభ్రంగా ఉంచుకునేటట్లు అవగాహన కల్పించాలని అన్నారు. ఎవరైనా డయేరియా బారిన పడితే బాధితులకు సత్వరమే వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులను సందర్శించి ఏమైనా డయేరియా కేసులు నమోదైతే డేటాను పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బివి.నాగేశ్వరరావు, జిల్లా అభివృద్ధి అధికారి కెసిహెచ్.అప్పారావు పాల్గొన్నారు.

3న ఆక్వా రైతుల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి – పాలకొల్లు

రాష్ట్రంలోని ఆక్వా రైతుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చడానికి ప్రాసెసింగ్ యూనిట్లు, సీడ్ యజమానులు, ఫీడ్ కంపెనీలు ముందుకు రాకపోవడంతో జూలై 3న పాలకొల్లులో ఆక్వా రైతులతో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జై భారత్ ఆక్వా రైతుసంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు చెప్పారు. పాలకొల్లు త్రిబుల్ ఎస్ కళ్యాణ మండపంలో శనివారం ఆక్వా రైతుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్‌రాజు మాట్లాడుతూ కంపెనీలు ఆక్వా రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని, కొత్త ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. జులై 3న పది వేల మంది ఆక్వా రైతులతో సదస్సు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘ కార్యదర్శి బోనం చినబాబు, ఉపాధ్యక్షులు కోడి విజయభాస్కర్, మేడిది జాన్ రాజు, పెన్మెత్స సత్యనారాయణరాజు, సజ్జ బుజ్జి, మేక ఫణింద్ర, అంగర వర ప్రసాద్, కర్నేన గౌరు నాయుడు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి – భీమవరం టౌన్




ఆందోళన చేస్తున్న దళితులు

ఎస్‌సిలకు శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని కోరుతూ వెంప సెంటర్లో దళితులు ఆందోళన చేపట్టారు. వెంపలోని ఎస్‌సి శ్మశాన వాటికలో ఆక్రమణలు అరికట్టాలని, ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని కోరారు. దళితులను అవమానించిన కె.రామచంద్రరాజు, ఆయనకు వత్తాసు పలుకుతున్న ఆర్‌డిఒపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటిక చుట్టూ ఫెన్సింగ్ వేసి నీటి సదుపాయం కల్పించాలని కోరారు. శ్మశానవాటిక వద్ద నుంచి వెంప బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ ఎస్‌సి శ్మశాన వాటికను ఆక్రమించి చేపల చెరువు వరకూ రోడ్డు వేస్తుంటే తాము అడ్డుకున్నామని గుర్తు చేశారు. పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఒ ఆధ్వర్యంలో సర్వే చేయించి ఆక్రమణలను అరికట్టారన్నారు. అయితే ఇప్పుడు అధికారులు ఆక్రమణదారుడైన కలిదిండి రామచంద్రరాజుకు కొమ్ముకాస్తూ మళ్లీ సర్వే అంటున్నారన్నారు. శ్మశాన వాటిక సమస్య పరిష్కరిస్తానని భీమవరం ఆర్‌డిఒ పిలిచి తమను అవమానించి పంపారని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డిఒపై చర్యలు చేపట్టాలని నినదించారు. ఈ ఆందోళనకు కెవిపిఎస్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మద్దతు పలికి మాట్లాడారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలెక్టర్ సమక్షంలో శ్మశానం చుట్టూ ఫెన్సింగ్ వేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బండి రాజు, ఇంజేటి త్రిమూర్తులు, పట్టెం చిరంజీవి, గోగులమండ సునీల్, కడిమి ఏసురత్నం, బల్ల రంగయ్య, పాలపర్తి దానియేలు, దొండపాటి బాల, ఇంజేటి పండు, పోలుకొండ శాంతకుమారి, బొబ్బనపల్లి సువార్త, చిలకపాటి ఆనంద్, ఇంజేటి మరియమ్మ, చిలకపాటి ఆదాము, మంద చిట్టిబాబు, నేతల దేవదానం పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి – గణపవరం

వెంకటరాజపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీలకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. ఓ పక్క ఉపాధి హామీ పనులు జోరుగా జరుగుతున్న తరుణంలో వెంకటరాజపురంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు నెల రోజులుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో మెడికల్ కిట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. పనిచేసే ప్రాంతాల్లో చెరువుల్లో పంట బోదెల్లో కాలువల్లో మందుబాబులు తాగి పడవేసిన సీసాలు పగిలి ఉపాధి కూలీలకు గాయాలవుతున్నాయని తెలిపారు. అందువలన అధికారులు మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే కూలీలకు వేతనాలు విడుదల చేసి వారి ఇబ్బందులు తీర్చాలని కోరారు.



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నిబంధనలకు తూట్లు.. పట్టించుకోని అధికారులు

ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన

ప్రజాశక్తి – ఉండి

మండలంలో విద్యా వ్యవస్థ వ్యాపారమయమైనప్పటికీ విద్యాశాఖాధికారులు చోద్యం చూస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి గాణాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో గీతాంజలి విద్యాసంస్థలో విద్యాహక్కు చట్టానికి నీళ్లొదిలి విద్య వ్యాపారం సాగుతుందని ఆరోపించారు. విద్యా సామగ్రిని రూ.6500 నుంచి రూ.తొమ్మిది వేల వరకూ విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఆ విద్యా సంస్థ వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. దీంతో ఎంఇఒ బొల్లిపో జ్యోతి అక్కడకు చేరుకుని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల సిబ్బందిని హెచ్చరించి విద్యాసామగ్రిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు కదిలి విద్యావ్యాపారాన్ని అరికట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎంఇఒ బొల్లిపో జ్యోతి మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తన దృష్టికి సమస్యను తీసుకురాగానే ఎంఇఒ–2 బొక్కా వినాయకుడితో కలిసి గీతాంజలి విద్యాసంస్థను పరిశీలించామని, ఒక గదిలో అమ్మకానికి నిల్వచేసిన నోట్ పుస్తకాలను, టెక్స్ట్‌బుక్స్‌ను, బ్యాగులను, ఐఐటి పుస్తకాలను విద్యా సామగ్రిని సీజ్ చేసి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. స్టూడెంట్ కిట్స్ పంపిణీ పూర్తవ్వగానే మండలంలోని అన్ని ప్రయివేటు విద్యాసంస్థలను తనిఖీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు కె.చందు, నాయకులు కె.గోవింద్, పి.సాయి, వై.సాయి, వి.వెంకట్, సహాయ కార్యదర్శి బి.గణేష్, బి.సిద్దు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించారు.. భారాలు దించుతారా..!

కేంద్రం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. మంత్రులు బాధ్యతలు సైతం స్వీకరించారు. ఎంఎల్‌ఎలు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్‌లో ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. అధికారుల బదిలీల పర్వం సాగుతోంది. అయితే ప్రజలు మాత్రం ఆర్థిక భారాలు ఎప్పటికి తగ్గిస్తారో.. సమస్యలు పరిష్కరించేదెప్పుడోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.



పలు హామీలతో ఎన్నికల్లో విజయం సాధించిన ఆయా పార్టీల నేతలు కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు ఏర్పాటు చేసి అధికారం చేపట్టారు. హామీల అమలు దిశగా అడుగులు ప్రారంభించారు. అయితే ప్రజల దైనందిన జీవితంలో కీలకమైన సమస్యలు మళ్లీ తెరపైకొచ్చాయి. గతంలో మాదిరిగా ఉల్లి ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ దీనిపై స్పందించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి సబ్సిడీపై ఉల్లిపాయలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించడం సామాన్యులకు ఊరటనిచ్చే అంశం. అదే సమయంలో మిగిలిన కూరగాయల ధరలు కూడా తగ్గించేలా చర్యలు చేపట్టాలని, ఆయా కూరగాయలు ఎక్కడ తక్కువకు దొరుకుతాయో తెలుసుకుని అక్కడి నుంచి రప్పించి ప్రజలకు రైతుబజార్లలో అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఇదేరీతిన ఏలూరు జిల్లా అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు సైతం దృష్టి సారిస్తే ధరలు ఎంతోకొంత దిగొచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. నిత్యావసరాలు, ఇతర ధరల సంగతేమిటో పాలకులే చెప్పాలి. ఇక మున్సిపాల్టీల్లో చెత్త పన్ను భారాన్ని అధికారికంగా ఎప్పుడు తొలగిస్తారా అని పుర ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇక ధాన్యం సొమ్ము కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఓ పక్క సాగు ఖర్చులు, మరోపక్క పిల్లల ఫీజులు చెల్లించాల్సి ఉండడంతో రైతన్నలు ఆర్థికంగా సతమతమవుతున్నారు. ధాన్యం సొమ్ముతోపాటు రైతులకు టిడిపి కూటమి హామీ మేరకు రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే చెల్లించాలనేది చిన్న, సన్నకారు, మధ్యతరగతి, కౌలు రైతుల అభిలాష. ఉపాధి కూలీలు సైతం బకాయి వేతనాల కోసం ఆశగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎన్నికల హామీ మేరకు ఐదు సంతకాలు పూర్తి చేశారు. వాటి ఆచరణ మిగిలింది. డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం వేలాది మంది బిఇడి, డిఇడి అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో టెట్, డిఎస్‌సికి సంబంధించి అభ్యర్థులు రుసుము చెల్లించి పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పరీక్షలు పూర్తయినా ఫలితాలు విడుదల చేయలేదు. టెట్ ఫలితాలు విడుదల చేయడంతోపాటు డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తే అభ్యర్థులకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టి వారం రోజులు కాకముందే గతంలో మాదిరిగానే ప్రతి సోమవారం పోలవరం రీతిగానే మొదటి సోమవారం పోలవరం పర్యటనకు విచ్చేశారు. పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేదుగాని అధికారులు మాత్రం నాలుగు సీజన్లు అవసరమని చెబుతున్నారని తెలిపారు. అంటే నాలుగు సంవత్సరాల సమయం పడుతుందని తెలుస్తోంది. ఇంతవరకూ బాగానే ఉంది గానీ నిర్వాసితులకు పునరావాసం, పరిహారం గురించి ఎక్కడా చర్చించిన దాఖలాల్లేవు. మొన్నటి వరకూ పోలవరం పనులు, పునరావాసం సమాంతరంగా సాగాలని కూటమి నేతలే చెప్పేవారు. అయితే ఈ పర్యటనలో పెద్దగా నిర్వాసితుల అంశం ప్రస్తావనకు రాకపోవడం బాధాకరం. ఇప్పటికైనా నిర్వాసితుల పునరావాసం, పరిహారం అందజేతపై ముందు దృష్టి పెట్టి అది పూర్తయిన తర్వాతే పనులపై కేంద్రీకరించాలని అంతా కోరుతున్నారు. లేనిపక్షంలో మళ్లీ జులై, ఆగస్టు నెలల్లో వచ్చే వరదలకు ఏలూరు జిల్లాలోని రెండు మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ మండలాలు ముంపునకు గురికాక తప్పదని ఆయా ప్రాంతాల ప్రజలు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా అడుగులు వేస్తుందా.. లేక పాతరీతినే వ్యవహరిస్తుందో వేచిచూడాలి.

– వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ధాన్యం బకాయిలు విడుదల చేయాలి

సిపిఎం మండల కమిటీ

ఉండి: రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి సంబంధించిన బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం ఉండి ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం నాయకులు చీర్ల శేషు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం విక్రయించిన రెండు నెలలవుతున్నా సొఉమ్మ చెల్లించకపోవడం దారుణమన్నారు. దీంతో రైతులు అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతోపాటు సార్వా సాగుకు నానావస్థలు పడుతున్నారని తెలిపారు. కొత్త ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మండలంలోని రైతులకు రావాల్సిన రూ.ఎనిమిది కోట్లు సొమ్ము వెంటనే విడుదల చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు వీరవల్లి మాధవరావు, కిలారి తవిటినాయుడు, నిమ్మితి కిషోర్, రామకూరి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఏరువాక పనులు

ప్రజాశక్తి - పెనుమంత్ర

శనివారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని రైతులు పలుచోట్ల వ్యవసాయ పనులు ముమ్మరంగా ఆరంభించారు. వ్యవసాయ భూముల్లో సాంప్రదాయంగా కాడి - జోడు ఎద్దులతో దున్నే దృశ్యాలు కనుమరుగు కాగా, ఎక్కడ చూసినా ట్రాక్టర్లు, దమ్ముచక్రాలు కనిపించాయి. మండలంలో 12,206 ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉండగా, ఇప్పటి వరకూ 250 ఎకరాల్లో రైతులు ఆకుమడులు వేశారని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.జ్యోషిలా వెల్లడించారు. ఈ సమయంలో మండలంలోని వ్యవసాయ భూముల్లో కనీసం 10 శాతం మేరకు కనీసం 610 ఎకరాల్లో ఆకుమడులు పోయాలని, ఇంకా 440 ఎకరాల్లో ఆకుమడుల పోత వెనకబడి ఉన్నందున రైతులు వెంటనే ఆయా భూముల్లో ఆకుమడులు పోయాలని ఆమె సూచించారు.


మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న సభ్యులు

మహిళకు కుట్టుమిషన్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు టిడ్కో గృహాల కాలనీలో ఇటీవల పర్యటించిన రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ఓ మహిళ కలిసి తన కుటుంబ పోషణ నిమిత్తం ఆర్థికంగా ఆదుకునేలా కుట్టు మిషన్ ఇప్పించాలని కోరింది. మంత్రి ఇస్తానని మాట ఇచ్చి ధర్మారావు ఫౌండేషన్ ద్వారా శనివారం బాధితురాలికి కుట్టు మిషను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు పెచ్చెట్టి బాబు, జివి, రావూరి.అప్పారావు, మేడిశెట్టి కేశవ మహిళకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపింది.

సామూహిక అక్షరాభ్యాసం


ప్రజాశక్తి - వీరవాసరం

ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సర్పంచి గెడ్డం భారతీభాస్కరరావు అన్నారు. రాయకుదురు కవురు వారివీధి ప్రాథమిక పాఠశాలలో శనివారం ఒకటో తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటి, రెండో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో విద్యాసామగ్రి అందజేశారు. మరెళ్ల జయలక్ష్మి, ఆనందం బాలాజీ, దేవిరెడ్డి పుల్లారావు, సూర్య వెంకటేశ్వరరావు సహకారంతో పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసి కడలి నెహ్రూ, పంచాయతీ సభ్యులు ఎం.దుర్గాప్రసాద్, కవురు శ్రీనివాస్, కాంప్లెక్స్ ఛైర్మన్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు ఆపండి : కిషోర్ కుమార్

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష సాధింపు చర్యలు, విష ప్రచారాలు ఎక్కువయ్యాయని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ భవనాలు, వైఎస్ఆర్ విగ్రహాలు ధ్వంసం చేస్తూ వైసిపి కార్యకర్తలు, నాయకులపై భౌతిక దాడులు చేస్తున్నారని తెలిపారు. నేడు తాడేపల్లిలో అన్ని అనుమతులతో నిర్మిస్తున్న పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేస్తూ కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి, న్యాయవ్యవస్థను అపహాస్యం చేశారని విమర్శించారు. విశాఖలో వైసిపి హయాంలో నిర్మించిన టూరిజం భవనాలను జగన్ ప్యాలెస్, రాజకోట రహస్యం అంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారానికి పూనుకుందన్నారు. ఇటువంటి చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని తెలిపారు.


మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక రాబర్ట్

జంతువులను చంపితే నేరం

ప్రజాశక్తి - వీరవాసరం

జంతువులను చంపితే నేరమని మండల పశువైద్యాధికారి డి.ప్రియాంక రాబర్ట్ అన్నారు. జంతు సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం జంతువుల హక్కులు, వాటి రక్షణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. వీరవాసరంలో వైద్యురాలు ప్రియాంక రాబర్ట్, కొణితివాడలో వైద్యురాలు ఎస్.సుమ ఆధ్వర్యంలో ఆయా జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుషులు ఏ విధమైన హక్కులు కలిగి ఉన్నారో, పశువులకు, జంతువులకు హక్కులు ఉన్నాయన్నారు. ఈ హక్కులపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. అకారణంగా పశువులను, జంతువులను చంపితే సెక్షన్ 428, 429 ప్రకారం జైలు శిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మండ రామకృష్ణ, జుత్తిగ శ్రీనివాస్, పశువర్ధక శాఖ సిబ్బంది ఆర్‌పి.శ్రీనివాస్, కె.శ్రీను, జి.రాకేష్‌కుమార్, సహాయకులు వినయ్, సూర్యరేఖ, భూలక్ష్మి పాల్గొన్నారు.

24న గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్తేరు క్వీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 41 సీట్లు, 7వ తరగతిలో 3 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు, 9వ తరగతిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు 24వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. అదనపు వివరాల కోసం 95504 02822 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ జల్లూరు రమేష్ బాబు వాసవి వనిత క్లబ్ సభ్యులకు సూచించారు. శనివారం మొగల్తూరులోని దత్తసాయి మందిరంలో క్లబ్ మండల అధ్యక్షురాలు గుండు లక్ష్మీకుమారి సుమారు రూ.పది వేలు వెచ్చించి సమకూర్చిన వాటర్ ట్యాంక్, బియ్యం, ఆలయానికి గంట, పైపు లైన్లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశమైన మాట్లాడారు. ఉన్నంతలో ఇతరులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు, వృద్ధులకు చేతి కర్రలు అందజేశారు. అలాగే పోలీసులను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఇంటర్నేషనల్ ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ కారుమూరి శ్రీరాములు, రివిజినల్ ఛైర్మన్ చెక్కా శ్రీనివాసరావు, జోన్ ఛైర్మన్ శ్యామల, కార్యదర్శి సీమకుర్తి అరుణ, కోశాధికారి అనంతపల్లి మంగామణి, కారుమూరి రత్నకుమారి పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టామని డిఎల్‌పిఒయు శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక కెనాల్ రోడ్డులో ఆయన సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్ కార్యదర్శి జి.గంగన్న, గంటా సుబ్బారావు, పాల్గొన్నారు.

కదలని నీరు.. అన్నదాత కన్నీరు..!

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో ప్రధాన పంట కాలువైన బ్యాంకు కెనాల్, నర్సాపురం కాలువలు, వాటి ఉపకాలువల సమీపంలో ఆవాసాలు అధికంగా ఉండడంతో చెత్త వ్యర్థాలు ఆయా కాల్వల్లోకి చేరుతున్నాయి. దీంతో పంట పొలాలకు సరిగ్గా నీరందక అన్నదాతకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ముఖ్యంగా బ్యాంకు కెనాల్, ఉప కెనాల్స్ పొడవునా పెనుగొండ మండలం దొంగరావిపాలెం నుంచి ఆచంట మండలం భీమలాపురం వరకు పలు గ్రామాలు ఉన్నాయి. పలుచోట్ల కాలువ గట్లపై కూడా ఇళ్లు, పశువుల పాకలు వెలిశాయి. దీంతో ఆయా ఇళ్లలో వ్యర్థాలు, చెత్త, ఇతర వస్తువులు సైతం కాలువలో వేయడం పరిపాటిగా మారింది. దీంతో చెత్త వ్యర్థాలు పలుచోట్ల అడ్డుపడటంతో దిగువకు నీరెళ్లే పరిస్థితి ఉండటం లేదు. మరోపక్క క్లావల్లో పూడిక పెరిగిపోతుంది. ఆచంట మండలం పెదమల్లం, కోడేరు, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, పెనుమంత్ర మండలం మార్టేరు, నెగ్గిపూడి, పోడూరు మండలం జగన్నాథపురం, కవిటం, జిన్నూరు, పెనుగొండ తదితర చోట్ల చెత్త వ్యర్థాలతో కాలువలు మెరకదేరాయి. ప్రధాన కాలువలకు అనుసంధానమైన పంట కాలువలు, బోదెల్లో సైతం ఇదే పరిస్థితి. ఆచంట, కోడేరు, పెనుగొండ, మార్టేరు తదితర చోట్ల ఇళ్లలో వాడకపు నీరు, మరుగుదొడ్లకు సంబంధించిన పైపులను సైతం కాలువల్లోకి ఏర్పాటు చేశారు. దీంతో నీరు కలుషితమవుతుందని రైతులు వాపోతున్నారు.


పెనుమంచిలి పంట కాలువలో చెత్తా చెదారం


విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత


కాళ్ల : విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఇఒ గాదిరాజు కనకరాజు అన్నారు. శనివారం వేంపాడు హిందూ ప్రాథమిక పాఠశాలలో 34 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. దాతలు కోసూరి సత్యనారాయణరాజు, గ్రామ సర్పంచి ఇర్రింకి పద్మావతి శ్రీనివాస్ రూ.14 వేల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఇర్రింకి పద్మావతి శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం బిఎన్.మురళీ శ్రీనివాస్, టిడిపి గ్రామ అధ్యక్షులు వీరమల్లు వేణుగోపాల్, దాతలు కోసూరి సత్యనారాయణరాజు, జనసేన అధ్యక్షులు వెంకటేష్, వాసవీ క్లబ్ సభ్యులు, రజక సంఘం అధ్యక్షులు బాల, ఉపాధ్యాయులు పివి.వరలక్ష్మి, బి.కిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఆచంట : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. శనివారం ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి ఎంపిపి నిధులు కేటాయించడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిపి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు ఎర్రగుప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎంపిటిసి గుడాల లక్ష్మీదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మొగల్తూరులో..

పాలకొల్లు : ఎంపిపి ప్రాథమిక పాఠశాల, పెదగరువు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న 44 మంది విద్యార్థులకు పాలకొల్లు పానకాల రాయ రామ్మోహన్ క్లబ్ అధ్యక్షులు గాదె వివి.సత్యనారాయణ, కోశాధికారి చొడిశెట్టి జ్ఞాన శంకర్ ద్వారా విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు పుస్తకాలను వినియోగించుకొని బాగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు నిల్లా సురేష్ బాబు, రాయపూడి భవానీ శంకర ప్రసాద్, పంపన లక్ష్మీనారాయణ, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని కాళీపట్నం పడమరలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యాసామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు ఆటపాటల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కౌరు సావిత్రి ఆదినారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాజేశ్వర్ పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నేత సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కాంబొట్లపాలెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు జల్లి సత్యనారాయణ (75) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు సిపిఎం నేత ముదునూరి సూర్యనారాయణ రాజు, బొర్రా ధర్మరాజు, అంతర్వేది పద్మనాభ కుమార్, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచి పల్లి జార్జిబాబు సత్యనారాయణ మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ పార్టీ ఏ కార్యక్రమం తలపెట్టినా సత్యనారాయణ ఎంతో చైతన్యవంతంగా పాల్గొని పలువురికి ఆదర్శంగా నిలిచేవారని తెలిపారు. అటువంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరనిలోటు అని తెలిపారు.


సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

పలువురు సంతాపం..

సత్యనారాయణ మృతిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, మాజీ ఎంఎల్‌ఎ సిపిఎం సీనియర్ నాయకులు రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, మాజీ ఎంఎల్‌ఎ దిగుబాటి రాజగోపాల్, సిపిఎం సీనియర్ నాయకులు వలవల శ్రీరామ్మూర్తి సంతాపం తెలిపారు.

నేడు వల్లూరులో ఉచిత మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - ఆచంట

పట్టణంలోని హాస్పిటల్, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో వల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకూ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వల్లూరు సర్పంచి నేలపూడి బేబి శనివారం విలేకరులకు తెలిపారు. ఈ మెడికల్ క్యాంపునకు ఎమ్‌డి జనరల్ డాక్టర్ కార్తీక్ మురుగుతి, యూరాలజిస్ట్ డాక్టర్ విజయ దుర్గ ప్రసాద్, ఎమ్‌డి డాక్టర్ శ్రీ లక్ష్మీ ప్రసన్న బయ్యా, ఎంఎస్ ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీహర్ష నారిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని ఆమె తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక కెనరా బ్యాంక్ వద్ద శుక్రవారం రాత్రి హైటెన్షన్ విద్యుత్ వైర్ తెగి పడడంతో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. అయి భీమవరానికి చెందిన అల్లాడి నరసింహులు (36) స్థానిక కెనరా బ్యాంకు వద్ద బండిపై బత్తాయిరసం అమ్ముతూ ఉంటాడు. రోజు వారీ విధానంలోనే రాత్రి 10.30 గంటలకు వ్యాపారం అయిపోయిన తరువాత ఇంటికి బయలుదేరాడు. సరిగ్గా అదే సమయానికి జాతీయ రహదారిపై స్తంభాలపై ఉన్న హైటెన్షన్ వైర్ తెగి ఆ వ్యక్తిపై పడడంతో అక్కడికక్కడే పడిపోయాడు. ఆ వెంటనే స్థానికులు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వేములదీవి గొందిమాలలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - నరసాపురం

వేసవిలో బాటసారులు దాహం తీర్చేందుకు వేములదీవి గొందిమూల సెంటర్లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేములదీవి కాపులకొడప వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయానికి నడిచి వెళ్లే వారికి ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామానికి చెందిన గుబ్బల విజయ్ కుమార్ ఆర్థిక సహాయంతో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ధరలు తగ్గించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - పెనుమంత్ర

గత ప్రభుత్వ హయాంలో సామాన్యుని నడ్డి విరుస్తూ ఇష్టారాజ్యంగా పెంచేసిన నిత్యావసరాలు, కూరగాయల, విద్యుత్తు ధరలు ప్రస్తుత ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విజ్ఞప్తి చేశారు. శనివారం మార్టేరు దేవాంగుల కళ్యాణ మండపంలో జరిగిన ఆచంట నియోజకవర్గం నాలుగు మండలాల కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రస్తుత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవడానికి అసలైన కారణాలు నిత్యావసరాలు, కూరగాయలు, ఇంటి పన్నులు, చెత్త పన్నులు, విద్యుత్తు, ఆర్‌టిసి, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచడమేనని తెలిపారు. అదేవిధంగా కేంద్రంలో బిజెపికి గతంలో కంటే సీట్లు బాగా తగ్గాయని తెలిపారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం పెరిగిన ధరలు తగ్గించేందుకు, చెత్త పన్ను రద్దుకు కృషి చేయాలని, చౌకు డిపోల ద్వారా రేషన్ సరుకుల సంఖ్య పెంచాలని, గత ప్రభుత్వ తప్పిదాలు సరి చేస్తూ మెరుగైన పాలన ప్రజలకు అందించాలని కోరారు.

బాధితులకు సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

భగ్గేశ్వరంలోని పాత రామాలయం వీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై రెండు కుటుంబాలు వారు నిరాశ్రయులయ్యారు. అప్పట్లో బాధిత కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా శనివారం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం, వంట సామగ్రి, దుస్తులు సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిల్లా వీరభద్రరావు, కౌరు వెంకట సత్యనారాయణ, సమతం భద్రం, అందే లింగయ్య, దొంగ బాబాయ్, పెనుమత్స శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

ఎంపిడిఒ ఎం.అనుపమ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ ఎం.అనుపమ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఇఒపిఆర్‌డి సమక్షంలో శానిటేషన్ ఒహెచ్‌ఆర్ ట్యాంక్ క్లీనింగ్, ఎస్‌ఎస్ ట్యాంక్, రక్షిత మంచినీటి సరఫరా చేయడం వంటి వాటిపై సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రివ్యూ నిర్వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తాగునీటి పరీక్షలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు దోమలు, కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులపైన అవగాహన కల్పించారు. ఎంపిడిఒ అనుపమ మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి క్లీన్ చేయాలని, లాగ్ బుక్‌లో డేట్లు నమోదు చేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెఎం.వైభవతి, ఆర్‌డబ్ల్యూ ఎస్‌ఎఇ వి.వెంకటరమణ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో సర్పంచులు ఉత్సవ విగ్రహాలే

పాలమూరు సర్పంచి వెంకట లక్ష్మీనారాయణ స్వామి నాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

గత ప్రభుత్వం సర్పంచులను ఉత్సవ విగ్రహాల్లా మార్చి, సర్పంచి పదవికి విలువ లేకుండా చేసిందని పాలమూరు గ్రామ సర్పంచి పంచదార వెంకట లక్ష్మీనారాయణ స్వామి నాయుడు అన్నారు. మంత్రిగా నిమ్మల రామానాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పాలమూరులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. ముఖ్యమంత్రి దగ్గర నుంచి సామాన్య కార్యకర్త వరకూ సర్పంచి అంటే విలువ లేకుండా పోయిందన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గ్రామ సర్పంచులను గుర్తించి, అంబేద్కర్ రాజ్యాంగ విలువలను కాపాడుతూ, విలువలతో కూడిన పరిపాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలను పక్కనపెట్టి సచివాలయాలను ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందని, కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చిన నిధులను ఎందుకు దారి మళ్లించారని, సర్పంచుల హక్కులను ఎందుకు నిర్వీర్యం చేశారని ఐఎఎస్‌లను ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రశ్నించడం తమకు సంతోషాన్ని కలిగించిందన్నారు. నీటిపారుదల శాఖా మంత్రిగా పాలకొల్లు శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి జాతికి అంకితం చేయాలని కోరారు.

24న చేపల చెరువు పాట

ప్రజాశక్తి - ఆకివీడు

నగర పంచాయతీ పరిధిలోని తాగునీటి చెరువులో ఒకరోజు చేపలు పట్టుకునేందుకు వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.కృష్ణమోహన్ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో తాగునీటి చెరువులు భుజబల రాయుడు సమ్మర్ స్టోరేజ్ చెరువుల్లో ఒకరోజు చేపలు పట్టుకునేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేలం పాట ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 11.30 గంటలకు కార్యాలయ ప్రాంగణం వద్ద నిర్వహిస్తామన్నారు. ఈ పాటలో పాల్గొనేవారు ఒక్కో చెరువుకు విడివిడిగా రూ.50 వేలు దరావతు చెల్లించాలని ఆయన చెప్పారు. పాట గెజిట్ నోటిఫికేషన్ షరతులకు లోబడి ఉంటుందని కమిషనర్ తెలిపారు.

అరుణాచలం సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం మాజీ సర్పంచి మల్లంపల్లి అరుణాచలం సేవలు ఎనలేనివని గ్రీన్ ఆర్మీ సభ్యులు బాలం శ్రీనివాస్ అన్నారు. అరుణాచలం 79వ పుట్టినరోజు వేడుకలు ఆచంట వేమవరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన గ్రీన్ ఆర్మీ సభ్యులు పూలమాల లేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆచంట వేమవరంలో 1964 - 1981 నుంచి 1987 - 1995 వరకూ సుమారు 25 సంవత్సరాలుగా సర్పంచిగా పనిచేసే అందరి మన్ననలూ పొందారని తెలిపారు. ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పంచాయతీ కార్యాలయం, మరియు మహిళా భవనాలను నిర్మించి ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేతుల మీదుగా ప్రారంభించడం గర్వించదగ్గ విషయమన్నారు. మాజీ సర్పంచి మల్లంపల్లి అరుణాచలం స్ఫూర్తితో గ్రీన్ ఆర్మీ సభ్యులు ఆ గ్రామానికి సేవలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాధవ శర్మ, మేడిద నాగరాజు, కేశవులు, వైవి.సత్యనారాయణ, కొల్లి నాగేశ్వరరావు, గణేష్, బుజ్జి పాల్గొన్నారు.

గిత్తల పోట్లాట వాహనాలు ధ్వంసం

మొగల్తూరు: మొగల్తూరులోని గాంధీ బొమ్మ కూడలిలో శనివారం రాత్రి రహదారిపై గిత్తలు పోట్లాడుకున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోట్లాడుకుంటూ వాహనాలపై పడడంతో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. రహదారుల పైకి వీటిని వదలకుండా అధికారులు యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పెనుమంత్ర: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డిఎల్‌టిసి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన క్రింద ఫీల్డ్ టెక్నీషియన్ - ఎయిర్ కండిషనర్ కోర్స్‌లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. చివరి తేదీ జూన్ 28వ తేదీ అని, వివరాలకు 9493482414 నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.